క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జ్ఞానేశ్వరికి కాంస్యం



పతకంతో జ్ఞానేశ్వరి

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో మధురవాడ వాంబేకాలనీకి చెందిన బాలిక జ్ఞానేశ్వరి విశేష ప్రతిభ కనబరచింది. ఈ నెల 28, 29 తేదీలలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో జ్ఞానేశ్వరి అండర్ –17 శాబర్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఉమ్మడి విశాఖ జిల్లా తరపున ఈ పోటీలలో పాల్గొని సత్తా చాటింది. విజేతను ఎన్ఐఎ కోచ్ ఐ.చరణ్, రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు సతీష్, జిలా కార్యదర్శి త్రినాథ్ అభినందించారు.

ముగిసిన జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న అండర్-14 బాలుర విభాగం విజేత జట్టు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ మైదానంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ టోర్నీలో సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో, అండర్ 14 బాలురు విభాగంలో, అండర్ 21 బాలుర విభాగంలోనూ ఈ జట్లు విజయం సాధించాయి. ఈ సందర్భంగా విజేతలకు బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ టీఎస్ఆర్ ప్రసాద్, కార్పొరేటర్ లొడగల అప్పారావు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సాగర్ నగర్ స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.సునీల్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డి.దొర బాబు, చెట్టిపిల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.


క్రీస్తు బోధనలు ఆచరణీయం



వేడుకల్లో పాల్గొన్న జాన్‌వెస్లీ తదితరులు

మధురవాడ: ప్రేమ, శాంతి, సమానత్వాన్ని ప్రబోధించిన దేవుడు ఏసుక్రీస్తు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ అన్నారు. క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని చెప్పారు. కొమ్మాది వికలాంగుల కాలనీలోని చర్చిలో బైపిల్లి మిషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అతిథులు కేక్ కట్ చేశారు. విశ్వాసులు క్యాండిల్స్ వెలిగించారు. పలువురికి దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్ విజయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గ్రేస్ మేరీ, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం మాజీ రీజనల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, పాల్, అప్పన్న, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పుస్తకాల పంపిణీ



హిందీ పరిచయ పుస్తకాలతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు హిందీ పరిచయ పుస్తకాల పంపిణీ జరిగింది. స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ సహకారంతో ఆరో తరగతి చదువుతున్న 39 మంది విద్యార్థులకు సోమవారం ఈ పుస్తకాలను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఇమంది వెంకటరావు పాల్గొన్నారు.

కొండవాలు తీరిన దిగులు

వైఎస్సార్‌సీపీ హయాంలో రక్షణ చర్యలు

రూ.74 లక్షలతో పటిష్టంగా రక్షణ గోడ

రూ.20 లక్షలతో మెట్లు, రోడ్డు నిర్మాణం

వరుస తుపాన్లు వచ్చినా నిశ్చింతగా జీవనం



సంతబయలు వద్ద నిర్మించిన మెట్లు



సంతపేట సత్యనారాయణ కొండ వాలు ప్రాంతంలో నిర్మించిన రక్షణగోడ

వరుస తుపాన్లు వచ్చినా కొండ వాలు ప్రాంత వాసులకు బెంగ లేదు. 2019 సంవత్సరానికి ముందు వర్షమంటే వణికిపోయిన వారు ఇప్పుడు ఎంత పెద్ద వర్షాలు కురిసినా నిశ్చింతగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన రక్షణగోడ, సీసీ రోడ్లు, మెట్ల మార్గం నిర్మాణంతో వారి భయాలన్నీ తొలగిపోయాయి. మార్గం సుగమం కావడంతో రాకపోకలూ సులభతరమయ్యాయి.

వర్షాలు కురిసినా నిబ్బరంగా..

స్థానిక ప్రైవేట్ మార్కెట్ వైపు కొండవాలు ప్రాంతంలో ఎక్కువగా ముస్లిం కుటుంబాలు నివసిస్తుంటాయి. మెట్లు, సీసీ రోడ్లు శిథిలం అయినా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొండపైకి పలు చోట్ల ఈ మార్గంలో రూ.20 లక్షలతో మెట్లు, రహదారి నిర్మించింది. దీంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా ఇక్కడివారు ఎలాంటి బెరుకు లేకుండా నిబ్బరంగా ఉన్నారు.



మార్కెట్ నుంచి కొండపైకి రహదారి మార్గం



ప్రైవేట్ మార్కెట్ వైపు కొండపైకి నిర్మించిన మెట్ల మార్గం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులలోని కొండవాలు చుట్టూ వాలు ప్రాంతం కుంగిపోయి, తరచూ ప్రమాదాలు జరగడంతో అక్కడ నివసిస్తున్న వారు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవించేవారు. మెట్లు లేక, సరైన రోడ్లు లేక ఇబ్బంది పడేవారు. ఇప్పుడిక ఆ బెంగ లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడతో పాటు సీసీ రోడ్లు, మెట్లమార్గం నిర్మించడంతో ఈ నెలలో ఎన్ని తుపాన్లు వచ్చినా నిశ్చింతగా ఉన్నారు.

కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్నవారు 2019కు ముందు తుపానులంటే వణికిపోయేవారు. ఈ వార్డులలోని సత్యనారాయణపేట, కొండపేట, బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాలలో కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో వందలాది మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో తరచూ సత్యనారాయణపేటలోని కొండ చుట్టూ వాలు ప్రాంతం కుంగిపోవడంతో ప్రమాదాలు జరిగేవి. ఒకరిద్దరు మృత్యువాత కూడా పడ్డారు. 2022 సెప్టెంబరులో కురిసిన వర్షాలకు సత్యనారాయణమెట్ట వాలు ప్రాంతంలో 15 అడుగుల ఎత్తు, 50 మీటర్ల పొడవైన రక్షణగోడ కూలిపోయింది. అప్పట్లో జరిగిన ఈ ప్రమాదంతో స్థానికులలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

చెక్కు చెదరని 'రక్షణ గోడ' :

ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.74 లక్షలతో వారం రోజులలోనే 16 అడుగుల ఎత్తు, 120 మీటర్లు వెడల్పుతో రక్షణగోడను యుద్ధప్రాతిపదికన నిర్మించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రెండుసార్లు నాసిరకంగా నిర్మించిన రక్షణగోడ చిన్నపాటి వర్షాలకే కూలిపోయేది. కొండపేట కొండ వాలు ప్రాంతాలలో పలుమార్లు గ్రావెల్ జారిపోవడంతో ఇళ్లకు ప్రమాదాలు జరిగేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్టమైన గోడ నిర్మించడంతో చెక్కు చెదరకుండా ఉంది. మెట్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో రాకపోకలకు బెంగ లేకుండా ఉంది.

జగన్ ప్రభుత్వం వల్లే నిశ్చింత



గతంలో జగన్ ప్రభుత్వం వచ్చినప్పుడే కొండపైకి వెళ్లే శిథిలమైన మెట్ల స్థానంలో కొత్తగా నిర్మించారు. ఇప్పుడు కొండపై నుంచి వర్షం నీరు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేదు. – షేక్ హుస్సేన్ బీబీ, సత్యనారాయణ పేట

రాకపోకలు సులభం



గతంలో సరైన మార్గం లేక చినుకు పడితే భయంగా ఉండేది. మెట్లు శిథిలం అవడంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు సార్లు కొండపై నుంచి ప్రైవేట్ మార్కెట్ వరకు సీసీ రోడ్డు, మెట్లు నిర్మించింది. ఇప్పుడు ఎలాంటి వాతావరణం అయినా నేరుగా రాకపోకలు చేయగలుగుతున్నాం. – షేక్ ఫాతిమా, సత్యనారాయణ పేట

ఇప్పుడు ఎలాంటి భయం లేదు



గతంలో వర్షం వచ్చినప్పుడు కొండవాలు ప్రాంతంలో నివాసం ఉంటున్నామని భయం భయంగా ఉండేది. ఇప్పుడా బెంగ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వసతులు సమకూర్చింది. ఇప్పుడు భయం లేదు. – వడిశల సూరమ్మ, సత్యనారాయణ పేట

ఎంతో పటిష్టమైన రక్షణగోడ



రైతుబజారు వైపు గత టీడీపీ ప్రభుత్వం రెండుసార్లు నిర్మించిన నాసిరకం రక్షణగోడ చిన్న వర్షాలకే కూలిపోయింది. దీంతో కొండవాలు ప్రాంత వాసుల ఇబ్బంది తీర్చడానికి చాలా తక్కువ వ్యవధిలోనే రూ.74 లక్షలతో పటిష్టమైన రక్షణగోడ నిర్మించారు. ఇప్పుడిక భయం లేదు. – తెల్లాపు అప్పలరాజు, తగరపువలస

అందరి సహకారంతోనే పాలిథిన్ నిషేధం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

భీమునిపట్నం: జనవరి ఒకటో తేదీ నుంచి పాలిథిన్ నిషేధం అమలవుతుందని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ దీనిని పాటించాలని కోరారు. మూడో వార్డు పరిధిలో మహిళలతో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకర ప్లాస్టిక్ సంచులు, ఇతర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం కచ్చితంగా అమలవుతుందని తెలిపారు. దుకాణాల్లో గానీ, బయట గానీ ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పాలిథిన్ నిషేధానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య అధికారి బి.మహలక్ష్మినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలపై అవగాహన ర్యాలీ



అంబేడ్కర్ కూడలి నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న శానిటేషన్ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ పరిధిలో పాలిథిన్ నిషేధంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు భీమిలి జోన్ శానిటేషన్ సిబ్బంది సోమవారం ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు, సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నేడు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం ఎ.బాలామణి తెలిపారు. ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, కస్తూర్బా విద్యాలయం సైన్సు ఉపాధ్యాయులు ప్రాజెక్టులు తీసుకుని విద్యార్థులతో హాజరు కావాలని ఆమె కోరారు.

తప్పిన పెను ప్రమాదం



ధ్వంసమైన గోడ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి పెను ప్రమాదం తప్పింది. వివరాలివి.. సాగర్‌నగర్‌లో నివసిస్తున్న భాను ప్రదీప్ తన టాటా ఏస్ వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారులో అతి వేగంతో వచ్చి, పార్క్ చేసిన టాటా ఏస్ వాహనాన్ని బలంగా ఢీకొన్నారు. దీంతో ఆ వాహనం ఐస్‌క్రీం పార్లర్ గోడను ఢీకొంది. దీంతో టాటా ఏస్ వాహనం వెనుక భాగం, ఐస్‌క్రీం పార్లర్ గోడ పూర్తిగా ధ్వంసమయ్యాయి. రాత్రి సమయంలో ఈ ప్రమాదం జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ఉన్నవారు మద్యం మత్తులో వేగంగా నడపడం వల్ల ప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెన్షన్ల పంపిణీ నేడు

తగరపువలస: జనవరి ఒకటో తేదీ నూతన సంవత్సరం సందర్భంగా సామాజిక పెన్షన్ల పంపిణీ మంగళవారమే చేపట్టనున్నట్టు ఆనందపురం ఎంపీడీవో డాక్టర్ వి.జానకి తెలిపారు. మండలంలో 18 గ్రామ సచివాలయాల పరిధిలో 8661 మంది పెన్షనర్లకు రూ.3,67,88,500 పంపిణీ చేయనున్నట్టు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో నలుగురికి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో తొమ్మిదో తరగతి విద్యార్థులు డి.భరత్ కుమార్, జి.జాహ్నవి రజత పతకాలు సొంతం చేసుకోగా ఆరో తరగతి విద్యార్థులు ఎం.లావణ్య, పి.భాగ్య శ్రీ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎ.బాలామణి, నాయకులు తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.నాగలక్ష్మి, పీడీ కె.నారాయణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

'అమిత్ షా రాజీనామా చేయాలి'



మెయిన్‌రోడ్డులో నిరసన తెలియచేస్తున్న భీమిలి జోన్ సీపీఎం నాయకులు

తగరపువలస: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు స్థానిక మెయిన్‌రోడ్డులో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ దేశానికి మనువాద, మతోన్మాద శక్తులతో ప్రమాదం పొంచి ఉందన్నారు. దళితులపై తరచూ జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ అమిత్‌షాను వెనకేసుకు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ' కు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం: విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్ష పే కార్యక్రమం విజయవంతంగా జరగడానికి అందరూ సహకరించాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంఈవో శివరాణి ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మరింత బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో ఎంపిక చేసిన విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడే అవకాశం ఉంటుందని, అందువల్ల ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు.

మత్స్యకారుల సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన సొసైటీ సభ్యులను అభినందిస్తున్న గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు, పెద్దల సమక్షంలో మత్స్యకారుల సొసైటీ ఎన్నికలు భీమిలిలో సోమవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షునిగా కారి చిన్నారావు, ఉపాధ్యక్షునిగా శీరం లక్ష్మణ, డైరెక్టర్లుగా శీరం ఉమ్మడి చిన్న, మసేను, శీరం పోలిరాజు, పుక్కళ్ల బాలాజీ, గరికిన ఎల్లాజీ, కారి నానాజీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ భీమిలి ప్రాంతంలోని మత్స్యకారుల సమస్యలను పరిష్కరించే విషయంలో సొసైటీ సభ్యులందరూ కలసికట్టుగా పని చేసి, పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు వాసుపల్లి కొండబాబు, బర్రి కొండబాబు, అల్లిపిల్లి అప్పారావు, పుక్కళ్ల అమ్మోరు, మట్టా దాసు, వాసుపల్లి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో షూటింగ్ సందడి



ఎడ్ల బండిపై మిత్రులతో వస్తున్న హీరో రోహన్

పద్మనాభం: పద్మనాభం మండలంలో మూడు రోజులుగా సినిమా షూటింగ్ జరుగుతోంది. వెంకటాపురం, పాండ్రంగి జంక్షన్, కురపల్లిలోని ఓ క్షత్రియుల ఇంట్లో షూటింగ్ జరిగింది. హీరో రోహన్, మిత్రబృందంపై ఎడ్ల బండిపై సన్నివేశాలను చిత్రీకరించారు. కురపల్లికి చెందిన ఆర్.సత్యనారాయణరాజు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారు. వెంకట్ పంపాన దర్శకత్వం వహిస్తున్నారు.

రీ సర్వేను విజయవంతం చేయాలని ర్యాలీ

పద్మనాభం: మండలంలోని గంధవరంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వేను విజయవంతం చేయాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిపి మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



బొట్ట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు తదితరులు

తగరపువలస: కుటుంబ కలహాల నేపథ్యంలో తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై మనస్తాపంతో ఇటీవల శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలికిరిలో ఆత్మహత్యకు పాల్పడిన భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన బొట్ట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ భీమిలి మండల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంతులూరి వాసురాజు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పూర్తిగా న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు సహా భీమిలి పోలీసు అధికారులతో మాట్లాడారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యులు పల్లా నీలిమ, సన్యాసిరావు, చెల్లూరి నగేష్, మేరుగు ఎల్లాజీ, మాజీ సర్పంచ్ పల్లా వెంకటరావు, పల్ల అప్పారావు తదితరులున్నారు.

గోస్తని నదిలో పశు కళేబరం



టి.నగరపాలెంలో ఊటబావి వద్ద నదిలో తేలుతున్న పశు కళేబరం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో వాటర్ వర్క్స్ రహదారిలో గోస్తని నదిలో సోమవారం పశు కళేబరం కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తున్న ఈ కళేబరం భీమిలి గ్రామీణ ప్రాంతాలకు నీరు సరఫరా చేసే పంప్‌హౌస్ ఎదురుగా ఊటబావి వద్ద తేలియాడుతూ కనిపించింది. దీనికి సమీపంలోనే జీవీఎంసీ భీమిలి జోన్‌కు తాగు నీరు సరఫరా అయ్యే ఊటబావులు సైతం ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చనిపోయిన ఆవును గోతిలో పూడ్చకుండా, నదిలో విసిరేసినట్టు పంచాయతీవాసులు తెలిపారు. దీనివలన తాగు నీరు కలుషితమై, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫెన్సింగ్ పోల్స్ కూల్చివేతపై ఫిర్యాదు

తగరపువలస:టి.నగరపాలెం పంచాయతీ సర్వే నంబర్ 55లో తమ అధీనంలోని భూమికి రక్షణగా వేసిన ఫెన్సింగ్ పోల్స్ కూల్చి, అడ్డంగా ఉంచిన మ్యాట్‌ను చీల్చివేశారని కోరాడ సూరిబాబు అనే వ్యక్తి భీమిలి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి తమ అధీనంలో సాగులో ఉన్న భూమిలో అప్పల నరసయ్య, నాగరమణ, నరసింగరావు అనే వ్యక్తులు తరచూ దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం కూడా వారే వీటిని కూల్చారని ఆరోపించారు.

రిటైర్డ్ హెచ్ఎంకు సత్కారం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయితీ పెద్దలు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రోమర్, స్థానిక పెద్దలు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, గోవింద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలో జింక



ఎండాడ జాతీయ రహదారి వద్ద సంచరిస్తున్న జింక

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఓ జింక సంచరించింది. ఇక్కడ సమీపంలో జూపార్కు ఉండటంతో అక్కడి నుంచి తప్పించుకుని ఇలా జనారణ్యంలోకి వచ్చింది. దీంతో ఇటుగా వెళ్లిన వాకర్లు జింకను ఫొటోలు తీశారు. జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు సాగుతుంటాయని, ఇటువంటి జంతువులకు ప్రమాదం తప్పదని జంతుప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూపార్కు అధికారులు మరింత జాగ్రత్తగా వాటిని సంరక్షించాలని కోరుతున్నారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 24 వినతులు



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఇన్‌చార్జి జెడ్సీ ఫణిరామ్

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 మధురవాడ కార్యాలయంలో ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఎంపీడీ ఫణిరాం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 24 అర్జీలు వచ్చాయి. ఇందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 8 రాగా, మీడియా ప్రతినిధులు అడిగిన సమాచారం ఇవ్వడం లేదంటూ 2 ఫిర్యాదులు రావడం విశేషం. పబ్లిక్ వర్క్స్ విభాగానికి-6, రెవెన్యూ-5, హార్టికల్చర్-1, యూసీడీకి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 3 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని ఫణిరాం తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.